

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

(క్రిందటి సంచికనుండి కొనసాగింపు)

**తిరిగి ఇండియానాకి బయలుదేరాము**. అందరం అలసిపోయాము. మళ్ళీ క్లాసులు, ఉద్యోగం మొదలు. క్రిస్మస్ సెలవులకి ఎవరెవరు ఇండియాకి వెళుతున్నారని మాట్లాడాము. కాసేపటికి సబ్‌వేలో తిన్నాము. ఆ తరవాత అందరికీ నిద్రముంచుకొచ్చింది. కారులో కొద్దిసేపు అంత్యాక్షరి ఆడాము. ఒకొకళ్ళు ఒక్కో రకం పాటలు పాడారు. నేను రెహమాన్ పాటలు ఎక్కువ ఎంచుకున్నాను. పాప పాత హిందీ పాటలు, రోషణ్ ఇళయరాజా పాటలు. మధ్యలో 'రోజావే చిన్ని రోజావే'లాంటి పాటలు పాడినప్పుడు అందరం ఎంతో నవ్వాము. పాడిన వ్యక్తి 'ఎందుకు నవ్వుతున్నావు?' అని ఎన్నిసార్లు అడిగినా సమాధానం ఎవరూ ఇవ్వలేదు. దారిలో స్నో పడడంతో మేము నిదానంగా వెళ్ళాము. చీకటి పడేసరికి నాకు భయం మొదలైంది.

"కారు స్కిడ్ అవుతుందేమో. ఎక్కడైనా ఆగుదామా?" అడిగాను.

"అక్కర్లేదు. స్నో ఎక్కువ లేదు. ఇప్పుడు ఆగితేనే కష్టం. తరవాత రోడ్లు క్లీన్ చేసేంత వరకు వెళ్ళలేము" రోషణ్ అన్నాడు.

అతనితో పాప కూడా ఏకీభవించింది. చీకటి పెరిగే కొద్దీ మా వేగం తగ్గింది.

"రెండు గంటలే. మెల్లిగా వెళ్ళిపోదాం" అన్నారు.

దాంతో భయపడుతూ, హనుమాన్ చాలీసా తలచుకుంటూ కూర్చున్నా. అమ్మమ్మ చెప్పిన "ప్రకృతి పగలు ఎంత అందంగా ఉంటుందో, రాత్రి అంత భయంకరంగా ఉంటుంది" అన్న మాటలు గుర్తొచ్చాయి. అది చెప్పి నా అభిప్రాయం అందరికీ చెప్పాను.

"భయం అంటే ఫార్మ్ హౌసెస్. అసలు ఎవరూ ఉండరు" అని ఒకరు.

"కాదు, బీచ్ అన్నిటికన్నా భయంకరం. ఆ అలల చప్పుడే భయపెడుతుంది" అని మరొకరు.

"ఫారెస్ట్ అన్నిటికన్నా డేంజర్. ఎక్కడ ఏ పాముందో, ఏ దొంగ దాక్కున్నాడో ఎవరికి తెలుసు" అంటూ భయం గురించి కాసేపు మాట్లాడాము.

అలా సంభాషణ దయ్యానికి చేరింది.

"అందరికీ దయ్యమంటే భయం కానీ మనుషులకన్నా అవి మంచివే" రవి అన్నాడు.

"అదేంటి? నీకేమైనా దయ్యం ఎప్పుడైనా హెల్ప్ చేసిందా?" పల్లవి అడిగింది.

"లేదు, లేదు. కానీ సినిమాల ప్రకారం ఎవరినైనా చంపితే వాళ్ళు దయ్యాలుగా మారతారు. ఆ తరవాత పగ తీర్చుకుంటారు. కానీ నిజంగా అలా జరగదు."

"ఎలా చెప్పగలవు?"

"మొగల్ రాజులు, బ్రిటిష్ వారు ఎంతోమంది ఇండియన్స్‌ని చంపారు. కానీ వాళ్ళెవ్వరూ దయ్యాన్ని చూసి పారిపోలేదు. దయ్యాలు వాళ్ళని చంపలేదు. అందుకే నేను దయ్యాలు, భూతాలు అంటే నమ్మను. కానీ అవి నిజంగానే ఉన్నాయి. మా ఊళ్ళో ఎన్నో కథలు విన్నాను."

"అవన్నీ మేడ్ అప్ స్టోరీలే. నిజంగా అలా ఏం ఉండవు"

"కాదు, నిజంగానే ఒక కథ చెప్తాను. ఓసారి మా తాతయ్యని ఇంటికి రమ్మని పెదనాన ఫోన్ చేసారట. తాతయ్య వెంటనే బయలుదేరాడు. ఇంట్లో అంతా జనాలు ఉన్నారని తాతయ్య ఆరుబయట కూర్చున్నారట. వాళ్ళ చెల్లి అది చూసి తన దగ్గరకి వెళ్ళి ఏడ్చిందట. ఎందుకు ఏడుస్తున్నావు అంటే 'లోపల అందరూ నన్ను గయ్యాళి గంప అని, పొగరు అని, రాక్షసినని అంటున్నారు' అందట. మా తాతయ్యకి కోపం వచ్చి లోపలికి గబగబా వెళ్ళి అందరినీ తిట్టాడట. 'నీకెవరు

చెప్పారు?' అని మా పెదనాన్న అడిగితే ఆరు బయట ఏడుస్తుంది అని అన్నారట. తాతయ్యని పక్క గదిలోకి తీసుకెళితే అక్కడ ఆ చెల్లి శవం ఉందట" అంది.

కారులో అంతా ఓ నిమిషం పాటు మాట్లాడలేదు. అంతా నిశ్శబ్దం. నాకు భయం మొదలైంది.

"నిజం అయి ఉండకపోవచ్చు" అంటూ వారు కొద్దిసేపు గొడవ పడ్డారు. నేను మాత్రం, హనుమాన్ చాలీసా జపిస్తూనే ఉన్నాను.

"మ ఊళ్ళో కూడా అలానే జరిగింది" రోషణ్ అన్నాడు.

"చెప్పు ఏమైందో" పాప కుతూహలంగా అడిగింది.

"మా నాయనమ్మకి దయ్యాలు కనబడేవట. చనిపోయినవారు మా నాయనమ్మకి వారి ఆఖరి కోరిక చెప్పేవారని మా ఊళ్ళో అందరికి చాలా నమ్మకం" అన్నాడు.

"బహుశా తనకి ముందే తెలుసేమో. లేదా అలా ఊహించుకున్నారేమో" అన్నాడు రవి.

"లేదు ఊహించుకోవడం కాదు. నిజంగానే జరిగింది. ఓసారి అర్ధరాత్రి అందరినీ లేపి హడావిడి చేసింది. అప్పుడు నేను అక్కడే ఉన్నాను" అన్నాడు.

"దయ్యం కనిపించిందని హడావిడా?"

లేదు. దయ్యాలు మా నాయనమ్మతో స్నేహంగా ఉండేవి. ఒక్క దయ్యం ఒక్కసారే కనిపించేదట. సినిమాల్లోలాగా మొహం పాడయిపోయి కాకుండా మామూలు మనుషుల్లానే ఉండేవట" అన్నాడు.

"ఇంతకీ ఎందుకు హడావిడి చేశారు మరి?" రవి అడిగాడు.

"అర్ధరాత్రి దాటింది. ముందు మా అమ్మని లేపింది. ఆ తరవాత మా బాబాయిని లేపింది. బాబాయి గొంతుకి అంతా లేచాము. ఆయన చాలా పెద్దగొంతుతో మాట్లాడతారు. పాయసం ఇంకా సెనగలు వండమని గోల."

"సెనగలు అంటే పప్పులాగానా?"

"లేదు. సెనగలు వేయించి, ఉప్పు, కారం, ఉల్లిపాయ, నిమ్మకాయ వేస్తారు. చాలా బావుంటుంది."

"ఓ.ఓకే. తరవాత ఏమైంది?"

"అంత రాత్రిపూట ఎందుకు అని బాబాయ్, పొద్దున చేస్తానులే అని మా అమ్మ. కాదు కాదు ససేమిరా చెయ్యాల్సిందే అని పట్టుపట్టింది. మా అమ్మ ఇంక కిచెన్‌లోకి వెళ్ళి వంట మొదలు పెట్టింది. ఆ తరవాత నన్ను, బాబాయ్‌ని పక్కకి పిలిచి 'ఒంగోలులో ఉండే రుక్మిణి చచ్చిందిరా. దానికి పాయసం, సెనగలు తినాలని ఉందిట తినేసి వెళ్ళిపోతుంది ' అంది. నేను కలొచ్చి ఉంటుంది అనుకున్నాను. వంట పూర్తయ్యాక ఓ గిన్నెలో పెట్టి వెనక గుమ్మంకి ఇవతలవైపు

పెట్టమంది. కొద్ది సేపటికి 'అది వెళ్ళిపోయిందిరా. అంతా పడుకోండి ఇంక' అంది. నేను ఏదో కలే అనుకుని నిద్రపోయాను. పొద్దున లేవగానే ఒంగోలు నుండి ఫోన్ వచ్చింది. రాత్రి నిద్రలో ఆ రుక్మిణి చనిపోయిందని చెప్పారు."

మళ్ళీ నిశబ్దం. నాకు భయం రెండింతలయ్యింది.

"నేను చెప్పాను కదా! దయ్యాలు మనుషుల కన్నా మంచివని. మనిషే మనిషిని చంపుతాడు. దయ్యం ఏం చెయ్యదు" రవి అన్నాడు.

"దయ్యాలు మంచివేమో కానీ పిశాచాలు మంచివి కాదు" పల్లవి అంది.

"ఎలా చెప్పగలవు?" రోషణ్ అడిగాడు.

"మా పెద్దమ్మకి ఒకసారి పిశాచం పట్టింది. అందరూ చచ్చిపోతుందనే అనుకున్నారు. ఎన్నో పూజలు, వ్రతాలు చేస్తే అప్పుడు వదిలిందట."

"ఔనా? ఏమైంది? ఎవరు ఆ పిశాచి?" రవి అడిగాడు.

"ఎవరో మళయాళం దయ్యం. ఓరోజు మధ్యాహ్నం అంతా పిచ్చి పిచ్చిగా మాట్లాడుతూ గట్టిగా నవ్వుతూ ఉందట. పక్కింటి వాళ్ళు విని అది మళయాళం అని చెప్పారు. ఏదో ఆక్సిడెంట్‌లో చనిపోయిందట. మా పెద్దమ్మని ఆవహించింది. టికెట్ కొంటే తిరువణ్ణామలైలో పనుంది అని కూర్చుందట. మా పెద్దమ్మ ఒక వారంలో బక్కచిక్కి జుట్టంతా ఊడిపోయింది. అందరినీ పిలిచి ఎన్నో హోమాలు చేసారు. ఆఖరికి తిరువణ్ణామలైకి వెళుతున్నామని కారెక్కించి అల్లూరికి తీసుకువెళ్ళారు. అక్కడ డైరెక్ట్ గుడి ముందు ఆపారట. ఆ మంత్రాలకి వదిలింది. అక్కడే కొన్ని పూజలు చేయించి, తాయత్తు కట్టి వెనక్కి తెచ్చారు."

మళ్ళీ నిశ్శబ్దం. ఇలా దయ్యాల గోలలో చివరికి ఇల్లు చేరాము. స్నో వల్ల ఎక్కువ భయం కలిగిందా, లేక దయ్యాల వల్ల కలిగిందా నాకు తెలీదు. ఆ రాత్రి వంటరిగా కాక వెన్నెల వాళ్ళ ఇంట్లో ఉండడమే నయమని నిశ్చయించుకున్నాను.

"ఎలా అయ్యింది ట్రిప్?" వెన్నెల అడిగింది.

"బాగా జరిగింది" ట్రిప్ విషయాలు చెప్పాను. ఈలోగా వెన్నెల అన్నం, పప్పు వండింది. తింటూ ఆ దయ్యాల కథలన్నీ చెప్పాను.

ఇంతకీ నీకు దయ్యాల మీద నమ్మకం ఉందా?" అడిగింది.

"నమ్మకమేమో కానీ భయం మాత్రం ఉంది" అన్నాను.

"భయపడుతున్నావంటే నమ్ముతున్నట్టేగా."

"నీకు భయమా?"

"ఇండియాలో చాలా భయపడేదాన్ని కానీ ఇక్కడికి వచ్చాక పోయింది."

"ఎలా?"

"ఏం లేదోయ్. మీ బిల్డింగ్‌లో నా ఫ్రెండ్ ఉండేది. హోంసిక్ అనిపించినప్పుడల్లా వాళ్ళ రూములో ఉండేదాన్ని. తను వెళ్ళిపోయే టైముకి అదే బిల్డింగ్‌లో ఇంకో ఫ్రెండ్ దొరికింది. నేను ఏ గదిలో అయితే ఉన్నానో, ఆ గదిలో ఎవరో ఆత్మహత్య చేసుకుని చనిపోయారట. ఇంకా ఆ బిల్డింగ్ కూడా స్మశానం మీద కట్టారు. నువ్వు సరిగ్గా చూస్తే పార్కింగ్ లాట్ వెనక కొన్ని సమాధులు అలానే ఉన్నాయి."

నాకు భయం రెట్టింపయ్యి కళ్ళల్లోంచి నీళ్ళు వచ్చాయి. నోటిలోంచి మాట రాలేదు. కాళ్ళు చేతులు చల్లగా అయిపోయాయి. దాంతో వెన్నెల భయపడి "జోక్ చేస్తున్నాను. నిజంగా అక్కడ స్మశానం లేదు. ఆటపట్టిస్తున్నా, అంతే" అని నవ్వింది. ఆ రాత్రంతా పీడ కలలవల్ల నాకు జాగారమే. ఆంజనేయ స్వామిని నేను ఆ రాత్రి ప్రార్థించినంత జీవితం మొత్తం కలిపి ప్రార్థించి ఉండను కాబోలు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story